సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

శామీర్‌పేట, జూలై 23: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులోని తిరుమల రాఘవేంద్రనగర్‌లోని మారుతీ గార్డెన్స్ సమీపంలో రూ.11.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పన ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. అందులో భాగంగా సీసీ, బీటీ రోడ్డు, మురికి కాల్వలు, తాగునీటి సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లావణ్యశ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటింటికి మొక్కల పంపిణీ

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో కౌన్సిలర్ కమిరెల్లి అనితాసుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి హాజరై ప్రజలకు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, నర్సింహ, నాయుడు, బీమానాయక్, నర్సింహ, వీరయ్య, చారి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మరాశిపేటలో మండల ప్రత్యేక అధికారి పర్యటన

నర్సరీని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సైదులు, ఎంపీడీవో మమతాబాయి

శామీర్‌పేట, జులై 23: మండల పరిధిలోని బొమ్మరాశిపేట గ్రామంలో ప్రత్యేక అధికారి, స్పెషల్ అడిషనల్ కలెక్టర్ సైదులు మంగళవారం పర్యటించారు. పంచాయతీ నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రాన్ని, పాఠశాలలను పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు, నిర్వహణ తీరును తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలు, తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించారు. చిన్నారులతో మాట్లాడారు. నాణ్యవంతంగా సేవలు అందించాలని టీచర్లు, ఆయా లకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మమతబాయి, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ ఉన్నారు.

కార్మికుల సంక్షేమానికి బీఎంఎస్ కృషి

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు, కార్మికులు

మేడ్చల్,జూలై 23:కార్మికుల సంక్షేమానికి భారత్ మజ్దూర్ సంఘ్ కృషి చేస్తుందని రాష్ట్ర నాయకుడు లిఖిత్‌కుమార్, సత్యనారాయణ అన్నారు. బీఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవం మేడ్చల్ పట్టణంలోని బీఎంఎస్ నిర్మాణ విభాగం కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించి, బీఎంఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ రాజకీయ పక్షానికి సంబంధం లేకుండా కార్మికుల శ్రేయస్సు కోసం బీఎంఎస్ పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల నిర్మాణ మజ్దూర్ సంఘం అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, కార్యదర్శి గంగాధర్ రెడ్డి, సహ కార్యదర్శి భార్గవ్, ఉపాధ్యక్షుడు ఏడుకొండలు, నర్సింహ రెడ్డి, కేశవులు, కృష్ణారెడ్డి, చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, రసూలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

వైద్యశిబిరంలో స్థానికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కాప్రా, జూలై 23: కాప్రాడివిజన్ గాంధీనగర్‌లో మంగళవారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజు ప్రారంభించారు. వైరల్ జ్వరాలు ప్రబలకుండా ప్రభుత్వం ప్రజల వద్దకే ఆరోగ్యకేంద్రాల ద్వారా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్పొరేటర్ అన్నారు. ఈ వైద్యశిబిరంలో బీపీ, షుగర్, జనరల్ చెకప్ నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమాదేవి, పీహెచ్‌ఎన్ జి. ఉషా, ఎంపీహెచ్‌ఈఓ, శ్యాం సుందర్, పాఠశాల హెచ్‌ఎంరాంరెడ్డి, గాంధీనగర్ యూత్ అధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత

పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్

ఉప్పల్, జూలై 23: నాచారంలోని ఓల్డ్ విలేజ్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ మంగళవారం పరిశీలించారు. అధికారులతో కలిసి పర్యటించి, పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారంలోగా పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణుగోపాల్, గ్రేటర్ బీఆర్ఎస్‌పార్టీ నాయకులు సాయిజెన్ శేఖర్, ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, బుచ్చన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కీసర, జూలై 23: రైతుబీమా కోసం రైతులందరు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మాధవిలత సూచించారు. వ్యవసాయాధికారి మాధవిలత మాట్లాడుతూ కొత్త పట్టాపాసుపుస్తకం వచ్చిన రైతులతో పాటు ఇంతకు ముందు రైతుబీమా చేయించుకోని రైతులు సహితం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు 18 నుంచి 59 సంవత్సరాలలోపు వయస్సు కల్గి ఉంటేనే అర్హులన్నారు. రైతులు రైతు పట్టాపాసుపుస్తకం, రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డులు జత చేసి సమర్పించాలన్నారు. ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే ఆధార్ లేదా నామిని చనిపోతే మాత్రమే మార్పుల కోసం ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సర్కారు దవాఖానలను పరిశీలించిన కలెక్టర్

ఘట్‌కేసర్ ప్రభుత్వ దవాఖానను పరిశీలించిన అనంతరం చిన్నపిల్లల వార్డులో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

- వార్డుల్లో తిరుగుతూ రోగుల బాగోగులు తెలుసుకున్న కలెక్టర్
- వైద్యుల పనితీరు,సౌకర్యాలు, అందుతున్న సేవలపై ఆరా
- అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులతో చర్చ

ఘట్‌కేసర్,జూలై23: ఘట్‌కేసర్,పోచారం,ప్రతాపసింగారం గ్రామాల్లోని సర్కారు దవాఖానలను జిల్లా కలెక్టర్ గౌతమ్ మంగళవారం పరిశీలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఘట్‌కేసర్‌లోని వైద్య విధాన పరిషత్ దవాఖాన,ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం,అనంతరం అన్నోజిగూడలోని పల్లె దవాఖాన,నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని,ప్రతాపసింగారంలోని పల్లె దవాఖానలను కలెక్టర్ పరిశీలించి అక్కడ అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా దవాఖానలలోని ప్రతి వార్డును క్షుణ్ణంగా పరిశీలించి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు.దవాఖానలోని వార్డులు,ఓపీలు, ల్యాబ్,ఐసీయూ యూనిట్,ఆక్సిజన్ యూనిట్,ఎక్స్‌రే,ప్రసూతి వార్డు,ఆపరేషన్ థియేటర్,ప్రత్యేక నవజాతి శిశుకేంద్రం తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించి అక్కడి పరిస్థితులు,రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాల అడిగి తెలుసుకున్నారు.దవాఖానకు కావాల్సిన అవసరాలను సూపరిటెండెంట్ కోట్యానాయక్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజుఎంత మంది అవుట్,ఇన్‌పేషంట్లు వస్తున్నారని,సౌకర్యాలు,ఏ ఏ వ్యాధులకు నిపుణులైన వైద్యులు ఉన్నారు,ఎలాంటి పరిస్థితులో గాంధీ వంటి పెద్ద దవాఖానలకు పంపుతున్నారన్న విషయాలను కలెక్టర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు.వార్డుల్లో రోగులను అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.రికార్డులను ఆయన తనిఖీ చేశారు.ప్రతాపసింగారం గ్రామంలో ప్రజాప్రతినిధులతో కలెక్టర్ అభివృద్ధి విషయాలపై మాట్లాడారు. పర్యటన సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.రఘునాథ్ స్వామి,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి,ఎంపీడీవో గీత,తహసీల్దార్ రజిని,ఘట్‌కేసర్ కమిషనర్ ఎండీ సాబేర్ అలీ,పోచారం కమిషనర్ వేమన రెడ్డి,చైర్మన్‌లు పావని,కొండల్‌రెడ్డి,వైద్యులు,సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం..



క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూలై 23: పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందజేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు.

మంగళవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మెరుగైన చికిత్స కోసం అల్వాల్ డివిజన్‌కు చెందిన గోవింద రాజుకు రూ.1.75లక్షలు, భాగ్యలక్ష్మికి రూ.1.75లక్షలు, మచ్చ బొల్లారంకు చెందిన రూ.1.75 లక్షలు, నేరేడ్‌మెట్‌కు చెందిన జనార్దన్‌రావుకు రూ.1.10లక్ష ల సీఎంఆర్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి,రమేష్, ఉషా, సంతోష్‌గుప్తా, శైలేందర్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులు రాజకీయంగా రాణించాలి

జవహర్‌నగర్, జూలై 23: ముదిరాజ్‌లు చదువుతోపాటు రాజకీయంగా రాణించాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి సహకరించాలని కోరుతూ వజ్రేష్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాయికుమార్, జవహర్‌నగర్ ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావుముదిరాజ్, అనిల్‌కుమార్ ముదిరాజ్, సాయి, రాజు, శేఖర్, రవి, సాయికుమార్, నగేష్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వజ్రేష్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జవహర్‌నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

నాగార్జుననగర్ కాలనీలో డ్రైనేజీలో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

చర్లపల్లి,జూలై 23: చర్లపల్లి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని నాగార్జుననగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యతో పాటు చెత్త తొలగింపు పనులను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆగని అక్రమ నిర్మాణాల జోరు

- నోటీసులపై బేఖాతార్...
- చర్యల్లో జాప్యంపై అనుమానాలు

మల్లాపూర్,జూలై23: అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అనుమతులేని నిర్మాణాలు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి. చర్యలు చేపట్టాల్సిన అధికారులు నోటీసులతో చేతులు దులుపుకుంటున్నారు. కాప్రా సర్కిల్ మల్లాపూర్ డివిజన్‌లో వందల సంఖ్యంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.అక్రమ నిర్మాణాలను గుర్తించి, ఉన్నతాధికారులకు సిఫారసు చేయాల్సిన సిబ్బంది సైతం పట్టించుకోకపోవడంతో అనుమానాలకు తావిస్తుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రభుత్వంలోని పెద్దల పేర్లను సైతం చెప్పుకొంటూ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మల్లాపూర్ డివిజన్‌లోని సూర్యనగర్, శక్తిసాయినగర్, మల్లాపూర్ ప్రధాన రహదారుల్లో సైతం అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు.

అధికారుల తీరుపై అనుమానాలు

నాచారం డివిజన్‌లోని ప్రధాన రహదారి సీఎస్ బ్రదర్స్ సమీపంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికే పలు ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఓ ఫంక్షన్‌హాల్ పేరుతో అతిపెద్ద నిర్మాణం చేపట్టడంపై పలు ఫిర్యాదులు అందడంలో గతంలో కూల్చివేసిన అధికారులు, మళ్లీ నిర్మాణం చేపట్టినా పట్టించుకోవడంలేదు. నాచారం హెచ్‌ఎంటీ కమాన్‌కు సమీపంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

కబ్జాదారులపై చర్యలు శూన్యం

మల్లాపూర్, నాచారం డివిజన్లలో ఇటీవలి కాలంలో జోనల్ కమిషనర్ పర్యటించారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ నిర్మాణదారులు మరిన్ని నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, కాలనీవాసులు కోరుతున్నారు.

త్వరలోనే కూల్చివేస్తాం..

నాచారం, మల్లాపూర్‌లోని అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే నోటీసులు అందించాం. త్వరలోనే కూల్చివేతలు చేపడతాం. నిర్మాణాలు చేపట్టకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. నాచారంలోని ప్రధాన రహదారిలో జరిగే నిర్మాణాలకు నోటీసులు అందజేశాం. త్వరలోనే అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం. **- గిరిరాజ్, ఏసీపీ, టౌన్‌ప్లానింగ్**

సర్కారు పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎమ్మెల్యే

మియాపూర్, జూలై 23: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు పాఠశాలలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. ఇప్పటికే వీటిలో ప్రవేశాల పరంగా ఎంతో పోటీ నెలకొంటున్నదన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌ను ఎమ్మెల్యే మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత విద్య, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు వంటి ఎన్నో వసతులను కల్పిస్తూ విద్యను ప్రభుత్వ అందిస్తున్నట్లు, విద్యార్థులు వినియోగించుకుని ఉత్తమ భవిష్యత్‌ను పొందాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మస్తాన్‌వలీ, కాంగ్రెస్ నేతలు నాయినేని చంద్రకాంత్‌రావు, హరినాథ్, లక్ష్మీనర్సయ్య, సత్యనారాయణ, శ్యామ్, చంద్రమోహన్, దుర్గ, లక్ష్మయ్య, శివ, శ్రీను, సోములు రమేశ్, పంతులు, భాస్కర్, రాజు, మల్లన్న, యాదగిరి పాల్గొన్నారు.

రెడ్‌మార్క్ స్థలాలు అన్యాక్రాంతం

రెడ్‌మార్క్ స్థలంతో వెలసిన అక్రమ నిర్మాణం

- సర్కారు భూములు కబ్జాదారుల పాలు
- పట్టించుకోని కమిషనర్, పాలకవర్గంసభ్యులు
- అధికారుల పనితీరుపై పలు అనుమానాలు
- భూములను కాపాడాలని జవహర్‌నగర్ ప్రజల డిమాండ్

జవహర్‌నగర్, జూలై 23: ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు కాలనీల్లో 249 రెడ్ మార్కు స్థలాలను కేటాయించింది. అప్పటి గ్రామ పంచాయతీ అధికారులు మున్సిపల్ కార్పొరేషన్‌కు స్థలాలను అప్పగించారు. మున్సిపల్ అధికారుల అలసత్వంతో రెడ్‌మార్క్ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. అక్రమార్కులు ఇదే అదునుగా చూసి సర్వే నెం. 606 మోహన్‌రావునగర్‌కాలనీలో పట్టపగలే అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉంది. పేదవాడు చిన్నగూడు నిర్మించుకుంటేనే ఆగమేఘాగా మీద వచ్చి కూలగొట్టే రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు రెడ్‌మార్క్ స్థలంలో అక్రమ నిర్మాణంకనిపించడం లేదా అంటూ జవహర్‌నగర్ ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇటీవల సర్వే నం. 606లోనే బేస్‌మెంట్ కడుతుంటేనే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెంటనే కూల్చివేశారు. తాజాగా నిర్మించిన అక్రమణ నిర్మాణం వైపు కన్నెతి చూడకపోవడం అధికారుల నిర్లక్షానికి నిలువెత్తు నిదర్శంగా కనిపిస్తుంది. ఆక్రమణలకు గురవుతున్న రెడ్‌మార్క్ స్థలాన్ని కాపాడి ప్రజా అవసరాలకు వినియోగించేలా చేయాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌ను స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలను సహించేది లేదు..

కార్పొరేషన్‌లో అక్రమ కట్టడాలను సహించేది లేదు. సెలవు దినాల్లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. రెడ్ మార్క్ స్థలాలు పూర్తిగా ప్రజా అవసరాలకే ప్రభుత్వం కేటాయించింది. దీని వెనుక పెద్దల హస్తం ఉన్నా వదిలిపెట్టం. రెడ్ మార్క్ స్థలంలో నిర్మాణాలు చేయడం నేరం. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. రెడ్‌మార్క్ స్థలాల్లో ప్రభుత్వసూచిక బోర్డులు ఏర్పాటు చేసి కాపాడుతాం. **- తాజ్‌మోహన్‌రెడ్డి కమిషనర్, జవహర్‌నగర్**

బడ్జెట్‌తో నగరానికి ఎలాంటి ప్రయోజనం లేదు

కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్

ఉప్పల్, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింటదని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి కేంద్రం మరోసారి అన్యాయం చేసిందన్నారు. కొన్ని రాష్ట్రాల ప్రయోజనాల కోసమే కేంద్రం పనిచేస్తుందని, బడ్జెట్ కేటాయింపులే రుజువు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి గెలుపొందిన ఎంపీలు, మంత్రులు వీటిపై స్పం దించాలన్నారు. ఎనిమిది మంది ఎంపీలు ఉన్నప్పటికి ఎనిమిది పైసలు తీసుకురాలేకపోయారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, నగరానికి జరిగిన అన్యాయంపై పోరాటం చేస్తామని, తగిన బుద్ధి చెప్పేవిధంగా పోరాటం చేస్తామన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, తెలంగాణ ప్రజలు బీజేపీకి 8ఎంపీ సీట్లు కట్టబెడితే... కేంద్రంలోని బీజేపీ తెలంగాణకు గాడిదగుడ్డు ఇచ్చిందని ఎద్దువ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్టు కనిపిస్తుందని, తెలంగాణకు మొండిచేయి చూపడం సిగ్గు చేటని విమర్శించారు. తెలంగాణకు రెండు కేంద్రమంత్రి పదవులు కట్టబెట్టిన... తెలంగాణ అభివృద్ధి కోసం బడ్జెట్ పెట్టకపోవడం దుర్మార్గమన్నారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Bellamkonda Krishnaveni** is the owners of Flat No. 303, M.No. 5-2-87/303, Second Floor, Built Up Area 680 Sft. with an undivided share of land admeasuring 25 Sq.yds., out of 800 Sq.yds., Sri Venkateswara Towers, Plot No. 153 & 152, in Survey No. 7, situated at Tirumal Nagar, Meerpet Village, Kapra GHMC Circle, Uppal Mandal, Medchal-Malkajgiri District who acquired the same vide Registered Sale Deed No. 9391/2024, Dated 15-07-2024. The Original Link Document Registered Sale Deed No. 6842/2000 & 4214/2008 are lost.

Whosoever has found the above mentioned Original Document and whoever has got any claims or rights over the above mentioned property. Please Contact: J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

నేరేడ్‌మెట్, జూలై 23: ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆయలంలోని శ్రీ సంకట విమోచన ఆంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం ఆంజనేయస్వామికి అభిషేకం, విశేష ఫలపుష్ప అలంకరణ, సింధూర పూజలను నిర్వహించినట్లు అర్చకులు తులసి వెంకట రమణాచార్యులు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రవీంద్ర రెడ్డి తెలిపారు.

వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 23: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) లిటరసీ హౌస్‌లో వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.ఎంఎస్ ఆఫీస్,ఇంటర్నెట్, ట్యాలీ ప్రైమ్, డీటీపీ, సీ లాంగ్వేజ్, పైథాన్, టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, జూట్ బ్యాగ్ మేకింగ్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్, ఫ్యాషన్ జ్యువెలరీ మేకింగ్, ఆర్టిఫిషియల్ ఫ్లవర్ మేకింగ్, బ్యూటీషియన్, బ్రైడల్ మేకప్, మెహందీ డిజైనింగ్, హెయిర్ స్టైలిస్ట్, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సులను అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9951210441,9701 098541 నెంబర్లలో సంప్రదించాలన్నారు.